

రాజీనామానా.. అవిశ్వాసమా

కొంతకాలంగా కొనసాగుతున్న పెద్దఅంబర్‌పేట మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పదవి పంచాయితీ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. 8లో▸



వార్షికోత్సవానికి ఆహ్వానం

రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆహ్వానించారు. 8లో▸



స్టాఫ్‌ నర్సుపై మహిళ దాడి

విధుల్లో ఉన్న స్టాఫ్‌ నర్స్‌పై ఓ మహిళ దాడి చేసింది. ఈ ఘటన షాద్‌నగర్‌ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది. 8లో▸



ఆమనగల్లు: సత్యసాయి మందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

◆ నివేదన

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలతో జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. అమ్మవారి ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఇళ్లలో అమ్మవారి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించి చల్లగా చూడాలని వేడుకున్నారు. పసుపు, కుంకుమలతో ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

◆ నిరసన

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాలు శుక్రవారం మొయినాబాద్‌ బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. షాపులన్నీ మూసివేయించారు. హిందువులపై దాడులను ఖండించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌: బంద్‌ సందర్భంగా ర్యాలీ చేపడుతున్న హిందూ సంఘాల నాయకులు



చేవెళ్ల: పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్‌ కళాశాల విద్యార్థుల ర్యాలీ

◆ ఆందోళన

వైద్య లోకం కన్నెర్రజేసింది.. కోల్‌కతాలో జరిగిన అమానవీయ ఘటనను ఖండించింది. పీజీ విద్యార్థిపై అమానుషంగా దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ముక్త కంఠంతో నినదించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేసింది.

న్యూస్‌రీల్‌

పరిధికి లోబడే చికిత్సలు అందించాలి

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



క్లినిక్‌ను సీజ్‌ చేస్తున్న సిబ్బంది

కొత్తూరు: వైద్యులు, ఆర్‌ఎంపీలు తమ వద్దకు వచ్చే రోగులకు చట్ట ప్రకారమే.. తమ పరిధిలో ఉన్న చికిత్సలు మాత్రమే అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. ఇటీవల మైనర్‌కు అబార్షన్‌ చేసిన కొత్తూరు పట్టణంలోని ఓ ఆయుర్వేదిక్‌ క్లినిక్‌ను శుక్రవారం సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిధి దాటి చికిత్స చేసినట్లు గుర్తిస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో జిల్లా పరిధిలోని ఆస్పత్రుల్లో వైద్యుల వివరాలు, రోగులకు అందిస్తున్న సేవల గురించి తనిఖీలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్‌, మాస్‌ మీడియా అధికారి తిరుపతిరావు, జిల్లా హెల్త్‌ ఎడ్యుకేషన్‌ అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చేవెళ్లలో ఉచిత వినికిడి పరీక్షలు

చేవెళ్ల: చేవెళ్లలోని శ్రీ సత్యసాయి ఆస్పత్రిలో ఈనెల 18న ఉచిత మెగా వినికిడి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ అడియాలజిస్ట్‌ డాక్టర్‌ ఎం.కృష్ణయ్య, డాక్టర్‌ గోపాల్‌ పేర్కొన్నారు. వినికిడిలోపం ఉన్నవారు, పుట్టుకతో చెవుడు, మూగవారు, వయస్సుతోపాటు వచ్చే వినికిడి లోపం ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వినికిడి సమస్య ఉన్న వారికి అందించే పరికరాలపై సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 90821 72700, 83283 93002 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెట్రోల్‌ బంక్‌లు అధ్వానంగా ఉంటే చర్యలు

మహేశ్వరం: పెట్రోల్‌ బంక్‌లు అధ్వానంగా ఉంటే చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ మాచన రఘునందన్‌ హెచ్చరించారు. మండల పరిధిలోని నాగారంలో ఉన్న పెట్రోల్‌ బంక్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెట్రోల్‌ బంకుల్లో యజమాని లేదా డీలర్‌ లేని పక్షంలో కనీసం మేనేజర్‌ అయినా బాధ్యతగా ఉండాలని తెలిపారు. నిర్వహణ సరిగా లేకపోతే వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తాయని అన్నారు. అప్పుడు చర్యలు తీసుకోక తప్పదన్నారు.

మళ్లీ థర్డ్‌ పార్టీ యాప్‌ ద్వారా కరెంట్‌ బిల్లుల చెల్లింపు

సాక్షి, సిటీబ్యూరో: థర్డ్‌పార్టీ యాప్‌ల ద్వారా కరెంట్‌ బిల్లుల చెల్లింపునకు డిస్కం మళ్లీ అవకాశం కల్పించింది. ఆర్‌బీఐ ఆదేశాలతో జులై ఒకటి నుంచి ఈ థర్డ్‌పార్టీ (ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్‌ పే) యాప్‌ల ద్వారా బిల్లుల స్వీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. పేమెంట్‌ యాప్‌ల ద్వారా బిల్లు చెల్లింపు ప్రక్రియను నిలిపివేసి, మీటర్‌ రీడర్లు జారీ చేసే బిల్లులపైనే డిస్కం క్యూ ఆర్‌ కోడ్‌ను ముద్రించి, వినియోగదారుడి నుంచి నేరుగా బిల్లులు స్వీకరించాలని నిర్ణయించింది. ఆ మేరకు క్యూఆర్‌కోడ్‌ రూపకల్పనకు చర్యలు చేపట్టింది. అయితే సెక్యూరిటీ పరంగా పలు సాంకేతిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని భావించి, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. పాత పద్ధతిలోనే బిల్లులు వసూలు చేయాలని నిర్ణయించి ఈ నెల 15 నుంచి ఈ సేవలను పునరుద్ధరించింది.

ముచ్చర్లకు మెట్రో

సాధ్యాసాధ్యాలపై హెచ్‌ఎంఆర్‌ఎల్‌ అధ్యయనం

ఎయిర్‌పోర్టు నుంచి ముచ్చర్ల వరకు అలైన్‌మెంట్‌

- మెట్రో రెండో దశ డీపీఆర్‌లోనే చేర్చే అవకాశం
- ఫ్యూచర్‌ సిటీని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రభుత్వం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్‌ సిటీ ముచ్చర్ల వరకు మెట్రోరైల్‌ విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. మెట్రో రెండో దశలో శంషాబాద్‌ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న మెట్రో మార్గాన్ని ముచ్చర్ల వరకు పొడిగించేందుకు హైదరాబాద్‌ మెట్రో రైల్‌ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ముచ్చర్ల వరకు మెట్రో విస్తరించనున్నట్లు స్పష్టం చేయడంతో హెచ్‌ఎంఆర్‌ అధికారులు ఆ దిశగా కార్యాచరణ మొదలుపెట్టారు. మెట్రో పొడిగింపు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మెట్రో రూట్‌ ఎంపిక, అలైన్‌మెంట్‌, భూసేకరణ, తదితర అంశాలపై సర్వే నిర్వహించనున్నారు. మెట్రో రెండో దశలో భాగంగానే ముచ్చర్ల వరకు నిర్మించనున్నారు. ఈ మేరకు త్వరలో ప్రభుత్వానికి అందజేయనున్న డీపీఆర్‌లోనూ ఈ అలైన్‌మెంట్‌ను చేర్చే అవకాశం ఉంది. దీంతో రెండో దశ మెట్రో భారీగా పెరగనుంది. ప్రస్తుతం 78.4 కిలోమీటర్ల మెట్రో అలైన్‌మెంట్‌కు సుమారు రూ.24,000 కోట్లతో ప్రభుత్వం అంచనాలను రూపొందించింది. ముచ్చర్ల వరకు పొడిగిస్తే ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.35 వేల కోట్లకు చేరుకొనే అవకాశం ఉంది. శంషాబాద్‌ ఎయిర్‌పోర్టు నుంచి ముచ్చర్ల వరకు మరో 35 కిలోమీటర్ల దూరం అదనంగా నిర్మించాల్సి ఉంటుంది.

ఎక్కడి నుంచైనా ముచ్చర్లకు చేరేలా..

హైదరాబాద్‌, సికింద్రాబాద్‌, సైబరాబాద్‌ తర్వాత ముచ్చర్ల మరో అతిపెద్ద నగరంగా విస్తరించనుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకనుగుణంగానే ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు ఈ నాలుగు నగరాల మధ్య కనెక్టివిటీని పెంచేవిధంగా మెట్రో సదుపాయం ఉండాలని అధికారులు ప్రతిపాదిస్తున్నారు. ఈ నగరాల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా సులభంగా చేరుకొనేలా మెట్రో కారిడార్‌లను నిర్మించనున్నారు. రెండో దశలో నాగోల్‌ నుంచి శంషాబాద్‌ వరకు నిర్మించనున్న మార్గంలోనే నేరుగా ముచ్చర్ల వరకు ప్రయాణం చేయొచ్చు. అంటే రాయదుర్గం నుంచి నాగోల్‌, ఎల్‌బీనగర్‌, చాంద్రాయణగుట్ట మార్గంలో నేరుగా రాకపోకలు సాగించొచ్చు. అలాగే.. మియాపూర్‌ నుంచి ఎంజీబీఎస్‌, ఫలక్‌నుమా రూట్‌లో చాంద్రాయణగుట్ట మీదుగా కూడా ముచ్చర్లకు కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది. రెండో దశలో నిర్మించనున్న 78.4 కి.మీ మార్గంలో నాగోల్‌ నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 29 కి.మీ ఉంటుందని అంచనా. అక్కడి నుంచి మరో 35 కి.మీ వరకు కొత్తగా పొడిగించాల్సి ఉంటుంది.

తుక్కుగూడ నుంచి ముచ్చర్ల వరకు..

శంషాబాద్‌ ఎయిర్‌పోర్టు నుంచి తుక్కుగూడ, ఫ్యాబ్‌సిటీ, రావిర్యాల, కొంగర, ఎలిమినేడు, తిమ్మాపూర్‌, రాచలూరు, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్‌ నుంచి ముచ్చర్ల వరకు మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రూట్‌ మొత్తం పొడవు సుమారు 35 కి.మీ వరకు ఉంటుంది. మరోవైపు ఈ రూట్‌లోనే అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఫ్యూచర్‌ సిటీ కోసం ప్రభుత్వం ఇప్పటికే 13,973 ఎకరాల భూమిని సేకరించింది. 10 జోన్‌లుగా విభజించింది. 34 శాతం భూమిని ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ జనరల్‌ పరిశ్రమలకు, మరో 30 శాతం లైఫ్‌సైన్స్‌ హబ్‌కు ,9 శాతం భూమిని నివాస, వాణిజ్య అవసరాలకు వినియోగించనున్నారు. మరో 7 శాతం పూర్తిగా నివాస ప్రాంతంగా ఉండనుంది. అలాగే.. క్రీడా మైదానాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, వినోదం, పర్యాటకం తదితర మౌలిక సదుపాయాల కోసం కూడా 3 శాతం భూమిని కేటాయించారు. ఇక ఫర్నిచర్‌, ఏఐ సిటీల కోసం 2 శాతం చొప్పున భూములు కేటాయించింది. ఔటర్‌రింగ్‌ రోడ్డు నుంచి అటు కందుకూరు నుంచి మరోవైపు యాచారం నుంచి రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఈ క్రమంలోనే మెట్రో నిర్మాణానికి సైతం కావాల్సిన భూమి, వనరులు, మౌలిక సదుపాయాలపై, నిర్మాణ వ్యయంపైనా కచ్చితమైన అంచనాలను రూపొందించేందుకు హైదరాబాద్‌ మెట్రో రైల్‌ తాజాగా దృష్టి సారించింది. అయితే.. ముచ్చర్ల మెట్రో అలైన్‌మెంట్‌ను రెండో దశ డీపీఆర్‌లో చేర్చి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తారా లేక విడిగా డీపీఆర్‌ను రూపొందిస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఓయూ ప్రొఫెసర్ల నుంచి రెండో ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ల నుంచి రెండో ఎమ్మెల్సీగా ప్రొ.కోదండరామ్‌ నియమితులయ్యారు. ఆర్ట్స్‌ కాలేజీ జర్నలిజం విభాగం ప్రొ.నాగేశ్వర్‌ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్సీగా వామపక్షాల మద్దతుతో గెలుపొందిన విషయం విదితమే. శుక్రవారం కోదండరామ్‌ తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా గవర్నర్‌ కోట నుంచి ఎమ్మెల్సీగా పదవీ స్వీకారం చేశారు. ఆర్ట్స్‌ కాలేజీ పొలిటికల్‌ సైన్స్‌ విభాగంలో ఎంఏ ఆ తర్వాత ఢిల్లీ జేఎన్‌యూలో ఎంఫిల్‌ పూర్తి చేసి ఓయూ ప్రొ.రమామెల్కోటే పర్యవేక్షణలో పీహెచ్‌డీ డాక్టరేట్‌ డిగ్రీ అందుకున్నారు. ఓయూ క్యాంపస్‌ ఆర్ట్స్‌ కాలేజీతో పాటు అనుబంధ నిజాం, సికింద్రాబాద్‌ పీజీ కాలేజీ అధ్యాపకుడిగా పని చేసి 2015 ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. తొలుత వామపక్ష (సీపీఎం) భావజాలం గల ఆయన కాలక్రమంలో తెలంగాణవాదిగా, ప్రజాస్వామ్యవాదిగా అనేక ఉద్యమాలు, వేలాది సభలు, సమావేశాల్లో ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా కొనసాగిన కోదండరామ్‌ తెలంగాణ జన సమితి (టీజేఎస్‌)ని స్థాపించి ఎన్నికల బరిలో దిగారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా గతంలో పోటీ చేసి ఓడిపోయారు. చివరకు కాంగ్రెస్‌ పార్టీ సహకారంతో గవర్నర్‌ కోట నుంచి ఎమ్మెల్సీగా ఎంపిక కావడంపై ఓయూలోని తెలంగాణ ఉద్యమకారులు, అధ్యాపకులు, ఉద్యోగులు హర్షం వెలిబుచ్చారు. ప్రొ.నాగేశ్వర్‌ ఎమ్మెల్సీగా ఓయూకు నిధుల పెంపునకు కృషి చేశారు. ప్రస్తుతం ఓయూ అభివృద్ధికి ప్రొ.కోదండరామ్‌ కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

కేటీఆర్‌ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

మీర్‌పేట: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్‌ చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి డిమాండ్‌ చేశారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో శుక్రవారం కేటీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉచిత బస్సు ప్రయాణం పథకంతో మహిళల నుంచి కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. సహనం కోల్పోయి మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్‌ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే మహిళలతో కలిసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సిద్దాల దశరథ, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్‌, సురేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మీర్‌పేట మహిళా అధ్యక్షురాలు పద్మ, గంగమ్మ, కీసర యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు



భూసార పరీక్షలు నిర్వహించొద్దంటూ రోడ్డుపై బైఠాయించిన రైతులు

నయానగరిలో భూసార పరీక్షలు

- అడ్డుకోబోయిన రైతులు
- పోలీస్‌ బందోబస్తు మధ్య కొనసాగిన పరీక్షలు

యాచారం: నయానగరి (ఫోర్త్‌సిటీ) నిర్మాణానికి సర్కార్‌ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మొదటి ప్రాధాన్యతగా భూసార పరీక్షలకు నిర్ణయించింది. ఫార్మాసిటీకి భూములు సేకరించిన కుర్మిద్ద గ్రామంలోని సర్వేనంబర్‌ 311(ప్రభుత్వ భూమి)లో టీజీఐఐసీ ఇంజినీరింగ్‌ విభాగం ఉన్నతాధికారుల బృందం నాలుగు చోట్ల పరీక్షలకు నిర్ణయించింది. శుక్రవారం మొదటి రోజు ఇంజినీరింగ్‌ విభాగం ప్రతినిధుల బృందం సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలతో భూసార పరీక్షలు ప్రారంభించింది. సమాచారం అందుకున్న కుర్మిద్ద గ్రామంతో పాటు తాడిపర్తి, నానక్‌నగర్‌, నక్కర్తమేడిపల్లి గ్రామాల నుంచి రైతులు అక్కడికి చేరుకున్నారు. భూసార పరీక్షలను అడ్డుకోబోయారు. పట్టా భూముల్లో పరీక్షలు చేయడం లేదని, రైతులకు పరిహారం ఇచ్చిన అసైన్డ్‌, ప్రభుత్వ భూముల్లోనే నిర్వహిస్తున్నట్లు టీజీఐఐసీ అధికారి వరుణ్‌ తెలియజేశారు. అయినప్పటికీ రైతులు వినిపించుకోలేదు. భూసార పరీక్షలు నిర్వహించే పొలం పక్కన రోడ్డుపై బైఠాయించి కొద్ది సేపు ఆందోళన నిర్వహించారు. టీజీఐఐసీ అధికారుల ఫిర్యాదు మేరకు మహేశ్వరం అడిషనల్‌ డీసీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, మంచాల, కందుకూరు, హైదరాబాద్‌ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌ స్టేషన్ల సీఐలు సత్యనారాయణ, బాబ్యానాయక్‌, సీతారాం, నర్సింహారావు ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రైతులపై గతంలోని బీఆర్‌ఎస్‌ సర్కార్‌ మాదిరిగానే ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని కుర్మిద్ద మాజీ సర్పంచ్‌ బందె రాజశేఖర్‌రెడ్డి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్‌ శ్రీకాంత్‌ నాయక్‌ అన్నారు. సర్కార్‌ తీరు మారకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్నవారికి నచ్చజెప్పి పంపించారు. అనంతరం పోలీస్‌ బందోబస్తు మధ్య భూసార పరీక్షలు కొనసాగాయి.

చరిత్రలో తొలిసారిగా..



కంటోన్మెంట్‌కు నేరుగా రూ.5.49 కోట్లు

- ప్రత్యేక నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- తాగునీరు, అభివృద్ధి పనులకు కేటాయిస్తూ ఉత్తర్వులు

కంటోన్మెంట్‌: సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌ బోర్డు పరిధిలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తొలిసారిగా రూ.5.49 కోట్ల నిధులు మంజూరయ్యాయి. స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ (ప్రత్యేక అభివృద్ధి నిధులు) కింద కంటోన్మెంట్‌ పరిధిలో 18 పనులు చేపట్టేందుకు ఈ నిధులు విడుదల చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి, కంటోన్మెంట్‌ సీఈఓ మధుకర్‌ నాయక్‌కు లేఖ రూపంలో వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ విజ్ఞప్తి మేరకు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిధులు మంజూరు చేయాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ కింద నియోజకవర్గానికి మొత్తం రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో రూ.2 కోట్లు విద్యకు, రూ.కోటి మంచినీటి సదుపాయాలకు, రూ.50 లక్షలు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వెచ్చించనున్నారు. ఈ మొత్తం నిధుల్లో తాజాగా రూ.5.49 కోట్లు విడుదల చేశారు.

ఏయే పనులకు ఎంత?

స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ కింద మంజూరైన రూ.5.49 కోట్లలో తాగునీటి వసతుల కల్పనకు రూ.70 లక్షలు కేటాయించారు. పది ప్రాంతాల్లో కొత్తగా బోర్‌వెల్స్‌ వేయనున్నారు. రూ.18 లక్షలతో ఒకటో వార్డు బాపూజీ నగర్‌లో సీసీ రోడ్డు, కార్ఖానా ప్రభుత్వ పాఠశాల సమీపంలో సీసీ రోడ్డుకు రూ.56 లక్షలు, బొల్లారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.75 కోట్లు, రసూల్‌పురాలో సీసీ రోడ్డుకు రూ.37 లక్షలు, నాలుగో వార్డు ఎల్‌ఐసీ కాలనీలో కమ్యూనిటీ హాలుకు రూ.30 లక్షలు, అమ్ముగూడ రైల్వే స్టేషన్‌- తిరుమలగిరి మెయిన్‌ రోడ్డు నిర్మాణానికి రూ.1.15 కోట్లు, రసూల్‌పురాలో నాలా అభివృద్ధికి రూ.48 లక్షలు కేటాయించారు.

తొలిసారిగా.. నేరుగా..

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్‌కు నేరుగా ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి నిధులు కేటాయించడం ఇదే తొలిసారి అని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. గతంలో ఎమ్మెల్యే నిధుల ద్వారా బోర్‌వెల్స్‌, కమ్యూనిటీ హాల్స్‌, జిమ్‌ తదితర అవసరాలకు మాత్రమే నిధులు మంజూరయ్యేవి. తాజాగా రోడ్ల నిర్మాణం, నాలాల అభివృద్ధికి సైతం నిధులు కేటాయించడం గమనార్హం.

కంటోన్మెంట్‌కే బోర్‌వెల్స్‌ బాధ్యతలు

కంటోన్మెంట్‌ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో బోర్‌వెల్స్‌ వేసే బాధ్యతను గతంలో వేర్వేరు సంస్థలకు అప్పగించే వారు. ఇటీవల ఓ సంస్థ కంటోన్మెంట్‌ నుంచి ఎన్‌ఓసీ తీసుకోకుండా, కంటోన్మెంట్‌ అధికారులకు సమాచారమే ఇవ్వకుండా బోర్లు వేస్తూ ఉండటంతో బోర్డు ఉన్నతాధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తాజాగా మంజూరైన 10 బోర్‌వెల్స్‌కు సంబంధించిన నిధులను నేరుగా కంటోన్మెంట్‌కే కేటాయిస్తూ కలెక్టర్‌ ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. రెండు నెలల క్రితం పికెట్‌లో నడిరోడ్డుపై బోరు వేయడంతో కంటోన్మెంట్‌ తాగునీటి పైపులైను పగిలిపోయింది. ఈ విషయంలో బోర్డు అధికారులకు కనీస సమాచారం కూడా లేదనే అంశాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. అనంతరం బోర్డు అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు, కంటోన్మెంట్‌ అనుమతి లేకుండా రక్షణ స్థలాల్లో బోర్లు వేస్తున్న విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్‌లో బోర్‌వెల్స్‌కు సంబంధించి ఎన్‌ఓసీ తీసుకునే ప్రక్రియ మొదలైంది. తాజాగా ఏకంగా బోర్‌వెల్స్‌ నిధులను నేరుగా కంటోన్మెంట్‌కే కేటాయించడం గమనార్హం.

మంత్రికి ధన్యవాదాలు

నియోజకవర్గంలోని కంటోన్మెంట్‌ ప్రాంతంలో అభివృద్ధి పనుల కోసం రూ.5.49 కోట్లు కేటాయించడంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో మంత్రిని ఎమ్మెల్యే కలిశారు.




డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కేఎల్లార్ తదితరులు

ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 20న నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, ఆయల ఉత్సవ కమిటీ సభ్యుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి అమ్మవారి కల్యాణం, బోనాల కార్యక్రమాలకు ఆహ్వానించారు. ఆహ్వానపత్రిక అందించిన వారిలో నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, పార్టీనాయకులు, గ్రామస్తులు తదితరులున్నారు.

ప్రమాదంలో గాయపడిన పెయింటర్

చికిత్స పొందుతూ మృతి

కేశంపేట: బైక్ ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఎక్లాస్ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన బట్టు మహేశ్(23), మిత్రుడు జగదీశ్ పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఈ నెల 14న రాత్రి ఇరువురు బైక్‌పై షాద్‌నగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులోకి రాగానే వారి బైక్ అదుపుతప్పి చెట్ల పొదల్లో పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే షాద్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మహేశ్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హ్యాష్ ఆయిల్ ముఠా అరెస్ట్

ఇబ్రహీంపట్నం రూరల్: హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఓ ముఠాను మహేశ్వరం జోన్ ఎస్ఓటీ బృందం, ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. విశాఖపట్నంకు చెందిన తలాపురెడ్డి సుధీర్, తలాపురెడ్డి దేముళ్లు, కేశంశెట్టి శంకర్‌రావు ఆదిబట్ల పరిసరప్రాంతాల్లో గంజాయి నుంచి తీసిన ద్రవపదార్థం హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నారని సమాచారం అందింది. దీంతో పోలీసులు శుక్రవారం సాయంత్రం ఆదిబట్ల టీసీఎస్ సమీపంలో దాడులు నిర్వహించి వీరి వద్ద నుంచి 3.8 కేజీల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన హ్యాష్ ఆయిల్ విలువ సుమారు రూ.32 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ



మంచాల: మహిళలపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. జనరంజక పాలన చూసి ఓర్వలేక మాట్లాడడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి బీఆర్ఎస్‌లో వణుకు పుడుతోందన్నారు. మహిలలు ఉద్యమించముందే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సెలూన్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దు

మణికొండ: స్థానికంగా ఉంటూ గ్రామస్తుల అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూ సెలూన్‌లను నడుపుకుంటున్న నాయీ బ్రాహ్మణుల పొట్ట కొట్టేలా వివిధ పేర్లతో సెలూన్‌లు వెలుస్తున్నాయని, వాటికి అనుమతులను జారీ చేయవద్దని మణికొండ మున్సిపాలిటీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్. శ్రీనివాస్, నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కొత్తగా సెలూన్‌లు ఏర్పాటుకు 500 అడుగుల దూరం ఉండాలనే నిబంధన ఉందని వాటిని పాటించకుండా ఇష్టారాజ్యంగా పలు బ్రాండెడ్ సంస్థలు సెలూన్‌లు ఏర్పాటు చేసి తమ పొట్ట కొడుతున్నారన్నారు. అలాంటి వాటికి ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయవద్దని మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో బాబురావు, శ్రీకాంత్, భరత్, పురుషోత్తం, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రాజీనామానా.. అవిశ్వాసమా?

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిపై కాంగ్రెస్ కసరత్తు


చెవుల స్వప్న, చైర్‌పర్సన్


పండుగుల జయశ్రీ, 8వ వార్డు కౌన్సిలర్



పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నాటి నుంచి పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి పంచాయితీ ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు మార్పుపై సీరియస్‌గానే ఉన్నట్లు తెలుస్తోంది. రెండేళ్లుగా చైర్‌పర్సన్ పదవి కోసం 8వ వార్డు కౌన్సిలర్ పండుగల జయశ్రీ పలుమార్లు విఫల యత్నం చేసిన విషయం విదితమే. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జయశ్రీని మున్సిపల్ చైర్‌పర్సన్‌ను చేస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం అప్పటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్న చైర్‌పర్సన్ చెవుల స్వప్న అనూహ్యం హస్తం గూటికి చేరారు. దీంతో అప్పటి నుంచి ఈ పంచాయితీ వాయిదా పడుతూ వస్తోంది. ఓ వైపు స్వప్న పదవిని వదులుకునేందుకు ఇష్టపడక.. ఇటు పదవిని ఆశిస్తున్న కౌన్సిలర్ మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశీస్సులతో చైర్‌పర్సన్ అయ్యేందుకు పట్టుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకులు పలు మార్లు కౌన్సిలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. చెర్‌పర్సన్ మార్పు తప్పనిసరి నేపథ్యంలోనే సమావేశాలు ఏర్పాటు చేశారని చర్చలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి విధేయుడిగా ఉంటూ మల్‌రెడ్డి సోదరులకు అనుచరుడిగా గుర్తింపు ఉన్న పండుగుల రాజు భార్య పండుగుల జయశ్రీని చైర్‌పర్సన్ చేసే అవకాశం ఉందని పెద్దఅంబర్‌పేటలో ప్రచారం జరుగుతోంది. కొన్ని నెలలుగా కొనసాగుతోన్న రాజకీయ అనిశ్చితికి ఫుల్‌స్టాప్ పడాలంటే మరో రెండు రోజులు ఆగాల్సిందే..

'రాజీ'నామా కుదిరేనా..?

చైర్‌పర్సన్ స్వప్నతో పాటు ఆ స్థానం కోసం పోటీ పడుతున్న జయశ్రీ ఇద్దరూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే. ఎన్నికల ముందు జయశ్రీకి ఇచ్చిన హామీ మేరకు పార్టీ పెద్దలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. స్వప్నతో రాజీనామా చేయించి వెంటనే ఆమోదిస్తే ఇరువురి ఖర్చులు తగ్గడంతో పాటుగా సమయం కలిసొస్తుందని ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. స్వప్న రాజీనామాకు అంగీకరించని యెడల మెజార్టీ కౌన్సిలర్లచే అవిశ్వాస నోటీసులు జారీ చేయించి అవిశ్వాస పరీక్షకు వెంటనే ఇప్పించాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్వప్న పదవికి రాజీనామాకు ఒప్పించే బాధ్యతను మున్సిపల్ స్థాయిలోని ఓ సీనియర్ నేతకు అప్పగించారని.. ఒకటి, రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తిచేయాల్సిందిగా శుక్రవారం సమావేశంలో ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

డ్రగ్స్, బెల్లం పట్టివేత

- 29.6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ పట్టివేత
- 1200 కేజీల బెల్లం, 50 కిలోల పటిక స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. వారి నుంచి 29.6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరో కేసుల్లో 1200 కిలోల బెల్లం, 50 కిలోల పటికను పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం అబ్కారీ భవన్‌లోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటకకు చెందిన పీపీ రాహుల్, మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన కొంతమంది వ్యక్తులకు అందజేసేందుకు 29.6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను తీసుకెళ్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్టీఎఫ్ డీఎస్పీ తుల శ్రీనివాసరావు నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. నితిన్‌రెడ్డి, నైజీరియాకు చెందిన జాక్సన్ అనే మరో ఇద్దరు వ్యక్తులకు కూడా ఇందులో ప్రమేయం ఉందన్నారు.స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ. 4.50 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.మరో కేసులో కోల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పెద్దకొత్తపల్లికి ఎంపీడీఓ కార్యాలయం వద్ద కర్ణాటక నుంచి బొలేరో వాహనంలో తరలిస్తున్న వస్తున్న బెల్లం, అలంను పట్టుకున్నారు. దీనివిలువ రూ. 1.20 లక్షల విలువ ఉంటుంది.వాహనం ఖరీదు రూ. 15 లక్షలు ఉంటుందన్నారు. ఆగస్టు 31 నాటికి తెలంగాణలో నాటు సారాను లేకుండా చేయడంతో పాటు గంజాయిరహిత ధూల్‌పేట్ లక్ష్యంగా అమ్మకాలపైన ఉక్కుపాదం మోపినట్లు చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి బలవన్మరణం

రాజేంద్రనగర్: కడుపు నొప్పి భరించలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలిక (17) ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం తల్లి పనికి వెళ్లగా మరో సోదరి కళాశాలకు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్యంతో ఉన్న తన స్నేహితురాలిని చూసేందుకు తోటి కళాశాల స్నేహితులు ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించడంతో స్థానికులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఖబ్రస్థాన్‌కు ఐదెకరాలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జనాభాకు అనుగుణంగా శ్మశానవాటిక లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సిఫారసు మేరకు ఐదెకరాల భూమిని కేటాయించారు. మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 44లో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించినట్టు జిల్లా కలెక్టర్ ఓ ఉత్తర్వులో పేర్కొన్నారు. ముస్లింల సమస్యను దృష్టిలో ఉంచుకుని స్థానిక సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గతంలో ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని కౌన్సిల్ అధ్యక్షుడు సీతారం తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఐదేకరాల భూమిని కేటాయిస్తూ వెలువడిన ఉత్తర్వులను తమకు అందజేశారన్నారు. సదరు భూమి విషయంలో గతంలో వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ శాఖల మధ్య వివాదం ఉంది. అదే భూమిని శ్మశానవాటికకు కేటాయించటంతో వివాదం సద్దుమనిగిందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అత్తాపూర్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేసిన ఘటన అత్తాపూర్ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ జి.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ వెంకన్న తెలిపిన ప్రకారం...పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 161 వద్ద శుక్రవారం గంజాయి విక్రయిస్తున్నారే సమాచారంతో పోలీసులు వెళ్లి తనిఖీలు చేపట్టగా గంజాయి విక్రయించేందుకు పాల్పడుతున్న ఇంతియాజ్ తప్పించుకోగా హైమద్ షేక్(53) షేక్ షకీల్(38) ను అదుపులోకి తీసుకుని రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

స్టాఫ్ నర్సుపై మహిళ దాడి


ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మహిళను కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: విధుల్లో ఉన్న స్టాఫ్ నర్స్‌పై ఓ మహిళ దాడి చేసింది. ఈ ఘటన శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది. ఎస్ఐ బలరాం తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన నీలం అలియాస్ రేనికుంట భార్గవి కుక్క కాటుకు గురైంది. దీంతో ఆమె ప్రభుత్వాస్పత్రిలో మొదటి డోస్ వ్యాక్సిన్ తీసుకుంది. గురువారం రెండో డోసుకు వెళ్లగా.. అక్కడే విధుల్లో ఉన్న దాసరి ఆశ ప్రిస్క్రిప్షన్ చూపమని కోరింది. దీంతో అక్కడ నుంచి వెళ్లిపోయిన నీలం తిరిగి రాత్రి ఆస్పత్రికి వచ్చి స్టాఫ్ నర్స్‌పై దాడికి దిగింది. ఈ దాడిని నిరసిస్తూ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శుక్రవారం విధులు బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్టాఫ్ నర్స్ ఆశ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నీలంను కోర్టులో హాజరు పరిచారు.

దొంగల బీభత్సం

- పటేల్‌చెరువులో మూడు ఇళ్లలో చోరీ
- 115 తులాల వెండి, అరతులం బంగారు ఆభరణాలు మాయం
- రూ.20వేల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు


పటేల్ చెరువు తండాలో మోహన్‌నాయక్ ఇంటి పరిశీలిస్తున్న క్లూస్ టీం

మంచాల: ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ చేసి దొంగలు బీభత్సం సృష్టించిన ఘటన పటేల్ చెరువు తండాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తండా సర్పంచ్ మోహన్ నాయక్ ఇబ్రహీంపట్నంలో నివాసం ఉంటున్నాడు. హోంగార్డు రవి ఉద్యోగ్య రీత్యా నగరంలో నివాసం ఉంటున్నాడు. జర్పుల బిచ్యానాయక్ కుటుంబ సభ్యులు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయపురం మండలం గంగమూల తండాలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. మాజీ సర్పంచ్ ఇంట్లో అరతులం బంగారం, ఐదు తులాల వెండి, రూ.5వేల నగదు, హోంగార్డు ఇంట్లో రూ.10వేల నగదు, బిచ్యానాయక్ ఇంట్లో 70 తులాల వెండి కాళ్లకడియాలు, 20 తులాల వెండి చేతి కడియాలు, మరో 20 తులాల వెండి వస్తువులు, రూ.5వేల నగదు దోచుకెళ్లారు. ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులతో పాటుగా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మంచాల ఎస్ఐ రజినీకర్, లాలయ్య క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

షాద్‌నగర్ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు

- డీఐ, కానిస్టేబుళ్లపై పలు సెక్షన్ల కింద కేసు
- హైకోర్టులో బాధితుల పిటిషన్

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళిత మహిళపై పోలీసుల దాడి కేసులో ఎఫ్ఐఆర్ నమోదైంది. బాధితురాలిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణల నేపథ్యంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ)తో పాటు ఆరుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు సునీత ఈ నెల 11న స్థానిక ఠాణాలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సస్పెన్షన్‌లో ఉన్న డీఐ రాంరెడ్డితో పాటు నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం, ఉద్దేశపూర్వకంగా హింస, మారణాయుధాలతో దాడి తదితర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

దాడి ఘటనలో బాధితులు హైకోర్టును ఆశ్రయించినట్లు న్యాయవాది డాక్టర్ బి.కార్తీక్‌నవయన్ శుక్రవారం తెలిపారు. డీఐ రామిరెడ్డితో పా టు కానిస్టేబుళ్లను సర్వీసు నుంచి తొలగించాలని, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పిటిషన్‌లో కో రారు. అధికారులు కేసును తప్పుదోవ పట్టించకుండా దర్యాప్తును నిష్పక్షపాతంగా జరిగేలా కేసును సీబీఐకి అప్పగించాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

- బుద్ధిమాంద్యం కలిగిన కుమారుడు పుట్టాడని దూరం పెట్టిన భర్త
- బిడ్డతో కలిసి నిరసనకు దిగిన వైనం..


భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న అలేఖ్య

రాజేంద్రనగర్: తనలా మరో మహిళకు అన్యాయానికి గురి కావొద్దంటూ ఓ గృహిణి తన కుమారుడితో కలిసి భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. మానసిక వికలాంగునిగా పుట్టిన సంతానాన్ని వద్దని తనను దూరం చేశాడంటూ నిరసన వ్యక్తం చేసింది. బాధితురాలి వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన బి.ఉదయ్ భాస్కర్ వివాహం ఫతేనగర్‌కు చెందిన అలేఖ్యతో 2014లో జరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన భాస్కర్‌కు వివాహ సమయంలో ఘనంగా కట్న కానుకలు ఇచ్చి వివాహం జరిపించారు. 2016లో వీరికి కుమారుడు జన్మించాడు. బాలుడు బుద్ధి మాంద్యంతో పుట్టడంతో ఉదయ్ భాస్కర్ భార్యాబిడ్డలిద్దర్ని దూరం పెట్టాడు. కుమారుడు అవసరం లేదని భర్త ఉదయ్ భాస్కర్‌తో పాటు కుటుంబ సభ్యులు తెలపడంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. పెద్దలతో పంచాయతీ పెట్టినా పరిష్కారం కాలేదు. వీరిద్దరి మధ్య కేసు కోర్టుకు చేరింది. ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తుంది. తనలా మరోకరికి అన్యాయం కావొద్దంటూ తన కుమారుడితో కలిసి హైదర్‌గూడలోని భర్త ఇంటి వద్ద శుక్రవారం ఆందోళనకు దిగింది. అలేఖ్య బంధువులు సైతం మద్దతు ప్రకటిస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలిసి భాస్కర్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు.